# మంగమ్మగారు - మాష్టరమ్మ పాత్ర

-డా॥ తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

**బు**జ్జి, అల్లుడు ఆఫీసుకు వెళ్ళాక, మంగపతిగారూ వాకింగ్ అంటూ ఎటో వెళ్ళిపోతారు. పాపకూడా స్కూలుకు వెళ్ళిపోతుంది గనుక ఒంటరిగా వుండాల్సి వస్తుంది మంగమ్మగారు. అదిగో ఆ టైములో ఆమెకు అమెరికా అంటే చికాకు పుట్టుకొస్తుంది. కనీసం అపార్ట్‌మెంట్‌లో వుంటే ఏ సాయంత్రం పూటో బయటకు వస్తే తెలుగు వాళ్ళు ఎదురయ్యేవారు. ముఖ్యంగా కూతుళ్ళ కాన్పులకనీ, చిన్న బిడ్డను చూసుకోవాలనీ వచ్చే అమ్మానాన్నలు బోలెడు మంది కనిపించేవారు. బుజ్జి సొంత ఇల్లు కొనుక్కుని ఇక్కడికి వచ్చాక ఎవరితోనూ మాటా పలుకూ లేకుండా పోయింది ఆమెకు.

కంప్యూటరు పెట్టిన గదిలోకి వచ్చి అద్దాల కిటికీలలో నుండి వీధిలోకి చూస్తూ కూర్చుంటుంది మంగపతిగారు వచ్చేదాక. ఎదురుగా వున్న పార్కులో కొంతమంది కనబడుతారు గానీ ఎవరి లోకంలో వారుంటారు.

సరిగ్గా తొమ్మిది గంటలయ్యేసరికి ఒక జపనీస్ దంపతులు పార్కు చుట్టూ నడవడానికి వస్తారు. అయితే వాళ్ళేమిటో తమాషాగా వెనక్కి నడుస్తారు. అదొకరకం ఎక్సర్‌సైజు అయియుండాలి. మరి కాసేపటికి ఒక చైనీస్ ఆవిడ పార్కులోకొచ్చి యోగాసనాలు మొదలు పెడుతుంది. ఒక కాలు మడిచి మరొక మోకాలు మీద పెట్టి ఒంటికాలిమీద నిలబడడం, బాలే డాన్సులో లాగా కదులుతూ ఒక చేతిని ఒక కాలిని నేలకు ఆన్చి మరో చెయ్యీ కాలు గాలిలోకి లేపడం లాటి ఆసనాలు వేస్తూ వుంటుంది.

తొమ్మిదిన్నర అవుతుండగా ఫిలిప్పీన్ జంట నడక మొదలుపెడతారు. నడిచేంతసేపూ రెండు చేతులూ ముందుకు జాపి చప్పట్లు కొడుతుంటారు.

వాళ్ళను చూసి ఒకసారి మంగపతిగారు అన్నారు "మెళ్ళో రాములవారి పటం తగిలించుకుని భజన చేసే మనవాళ్ళు గుర్తుకువస్తారు కదూ" అని. అది గుర్తొచ్చి నవ్వుకున్నారావిడ.

పది గంటలకు ఇండియన్ ఒకాయన పార్కు చుట్టూ నడక మొదలుపెడతాడు. వయసు అరవై పైనే వుంటుంది. గానీ కనీసం అయిదారు ప్రదక్షిణలు చేస్తాడు అంత పెద్ద పార్కు చుట్టూ.

ఒకసారి ఆ టైములో మంగమ్మగారు కూడా ఇంటి ఎదురుగానే కదా అని ఒక్కరూ వాకింగు వెళ్ళారు. చీరలో వున్న ఆవిడను చూడగానే స్పీడుగా నడుస్తున్న వాడల్లా ఆగిపోయి "హలో! ఆర్ యు ఫ్రమ్ ఇండియా? అయామ్ ఆల్సో ఫ్రమ్ ఇండియా.. వి ఓన్డ్ టూ గుజరాతీ హోటల్స్ ఇన్ హైద్రాబాద్. మై డాటర్ ఈజ్ ఇన్ టెక్సాస్. సన్ ఈజ్ హియర్" అంటూ పొడుగ్గా ప్రవర చెప్పాడు.

"నమస్తే..." అని చెప్పి నడకసాగించారు మంగమ్మ

## పానీ బరీసాకో

**మ**న్ను మిన్ను కేసి చూస్తున్నది
తొలకరి కోసం తహతహలాడుతోంది
మేఘమాలికల పులకరింతలు
చినుకు చేతులతో పుడమి ఆలింగనానికే!
ఇప్పుడవన్నీ పిల్లల చేతుల్లో కాయితప్పడవలే!
రైతన్నల కళ్ళల్లో మెరుపుల అద్దాలే!
దాహంతో ఎండిన పెదవులకి అమృతమే!

ఈ చెట్ల నృత్యం చూస్తుంటే
గ్రీష్మానికి వీడ్కోలు చేసేసినట్లున్నై
పసిపువ్వు మొదలు పండుటాకుదాకా
చినుకు స్పర్శ సోకగానే
విచ్చుకున్న మందహాసమౌతున్నై
ఇంక ఉరికి ఉరికి రండి మేఘాల్లారా
జల్లు జల్లులతో మురిపించండి.
మట్టి హృదయాన్ని సుగంధంతో నింపండి
మట్టి మనిషి దారంతా ముత్యాలు పరుస్తూ
తరలిరండి! తనివారా తనియించండి!

-డా॥ సి. భవానీదేవి

గారు. ఒక చుట్టు చుట్టాక మళ్ళీ రెండో ప్రదక్షిణలో మళ్ళీ ఆవిడను ఆపాడు ఆయన "హలో! నమస్తే యు ఆర్ ఫ్రమ్ ఇండియా? అయామ్ ఆల్సో ఫ్రమ్ ఇండియా..!!" అంటూ పది నిముషాలు ముందు చెప్పిన విషయాలే మళ్ళీ క్రొత్తగా చెప్పాడు.

మంగమ్మగారికేమీ అర్థం కాలేదు. మళ్ళీ మూడో ప్రదక్షిణలో ఆయన ఎదురుగా వస్తుండగా చూసి గభాలున రోడ్డు దాటి ఇంటికి వచ్చేసిందావిడ.

ఈ విషయం ఇంట్లో వాళ్ళతో చెప్తే వాళ్ళు నవ్వేశారు. వాళ్ళను కూడా అలాగే ఆయన పది నిముషాలకోసారి తన గురించి క్రొత్త వాళ్ళకు చెప్పినట్టు చెప్పాడట.

"పాపం జ్ఞాపక శక్తి బాగా తగ్గినట్టుంది. ఆ కొడుకు కోడలు ఈయన్ని ఒంటరిగా వాకింగుకు ఎందుకు పంపిస్తారో.. ఇల్లు మరచిపోతే ఎంత కష్టం!" అంది బుజ్జి.

బుజ్జీ వాళ్ళు దగ్గరలేనప్పుడు మంగపతిగారు భార్యతో అన్నారు "మనం కూడా కొన్ని ఏళ్ళు ఇక్కడ వుండే ఈ ఒంటరితనంతో అలాగే సగం పిచ్చివాళ్ళలా తయారవుతామేమో!" అని.

"ఛ ఏం మాటలండీ? వాళ్ళు మాట్లాడకపోతే మనమే స్నేహంగా పలకరించి నలుగురు మనుషులతో మాట్లాడాలి" అని సర్దిచెప్పారు మంగమ్మగారు. "అవును ఎంతమంది ఫ్రెండ్స్‌ని చేసుకుంటావో ట్రైచేయి" అన్నారాయన. ఈరోజు కిటికీ దగ్గర నిలబడి వాళ్ళందర్నీ చూస్తుంటే ఆవిడకు తను అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. ఆయన ఛాలెంజి చేసినట్టు మాట్లాడ్డం గుర్తొచ్చింది. హఠాత్తుగా ఒక నిశ్చయానికి వచ్చి తనూ చెప్పులు వేసుకుని, ఇంటికి తాళం పెట్టి, రోడ్డుదాటి పార్క్‌లోకి నడిచారు మంగమ్మగారు.

జులై వరకూ ఎండ చురుకు కనబడదు గనుక వాతావరణం చాల ఆహ్లాదంగా వుంటుంది. పన్నెండు గంటల వరకు బయట తిరిగినా పెద్ద అలసటగా అనిపించదు కాలిఫోర్నియాలో.

పార్కులో వున్న బెంచిమీద పద్మాసనం వేసుకుని కూర్చుని ప్రాణాయామం చేయడం మొదలు పెట్టిందావిడ.

ఈ మధ్యన ఇండియాలో ఎక్కడ చూసినా, ఎవరి నడిగినా రామ్‌దేవ్ బాబా యోగా ప్రాణాయామం గురించి, రవిశంకర్ ఆర్ట్ ఆఫ్ లివింగు గురించి లేకపోతే సిద్ధసమాధి యోగ, సహజ యోగ అంటూ

## ఒక దృశ్యం వెన్ను చరిచినప్పుడు...

ఎపుడో ఒకప్పుడు
ఎక్కడో ఒకచోట
ఒక అసంకల్పిత ప్రత్యక్ష దృశ్యం
మనిషి వెన్ను చరుస్తుంది
నిద్రావస్థలోని మస్తిష్కపు అనుభూతుల్లోకి
ఒక మెరుపు కిరణం కేంద్ర బిందువై
చైతన్యపు జీవం ప్రవహిస్తుంది.
నిర్జీవాన్ని సజీవం చేసే
తొలకరి చినుకై
దృశ్యం ప్రేరేపించిన అంశం
స్తబ్ధతా కవచాన్ని ఛేదించుకుని
మనసు మాళిగపై మొలకెత్తి
అనంత గమ్యంవైపు
చేతులు ముకుళిస్తుంది.
అర్థించే హస్తాన్ని అందుకున్న
స్నేహ హస్తం గొడుగు తానే అవుతుంది.
అణువుకు మరో అణువు తోడై
మహాణువు అయినట్టు
ఆలోచనలు ఆచరణతో సంగమించగానే
కోశస్థ దశ నుంచి కౌమార దశ వరకూ
అవిచ్ఛిన్నంగా ఎదుగుతూ
'అంశం' స్వేచ్ఛా విహంగమౌతుంది.
మనిషే దాన్ని అధిరోహిస్తాడో
అంశము మనిషితో మమేకమే అవుతుందో గాని
ఒక నవ్య చైతన్యం
ప్రపంచమంతా మంచు భాష్పంలా పరుచు
కుంటుంది.
మరో నవలోక సృష్టికి నాందీ వాచకమౌతుంది.

-కొత్తపల్లి ఉదయబాబు

## మినీ కవిత

**నా** కవితలు / పిల్లల్లే
ఒప్పుకుంటాను
కానీ అవి
రేపటి సాహితీ సౌధానికి
పిల్లర్లు కూడాను!

## హద్దులు

**ఇ**క్కడ
కులానికి కులానికి
మతానికి మతానికి
పేరుకీ పేరుకీ
అడుగడుగునా
సరిహద్దులు
అందుకే అరాకొరా
అభివృద్ధి!
హద్దులు లేనిదల్లా
అవినీతికే!!

## నేటి నిజం!

**ప**చ్చదనం మీద
పర్యావరణం మీద
కవిత్వానికి అవార్డు!
పట్టెమంచానికి
ద్వారబంధానికి
చెట్టుతల్లి హత్య!!

## భావం

**గు**డిలోకి / వెళ్ళేటప్పుడు
భక్తిభావం!
బయటికి
వెళ్ళేటప్పుడు
కైంకర్య భావం!

## సంక్రాంతి లక్ష్మి

**ము**గ్గులొదిలేసి
ఒకటి కొంటే
మరోటి ఉచితం-
ఆ ముగ్గులో పడింది!!

-గుడిమెట్ల గోపాలకృష్ణ

మాట్లాడ్డం బాగా ఫ్యాషనయింది.

ముఖ్యంగా ఈ గురువులిద్దరూ ఇతర దేశాలలో వేలాది మంది శిష్యులు కలిగి వుండటం, లండన్, ఫ్రాన్స్, అమెరికా మొదలైన దేశాల్లో యోగా శిబిరాలు నిర్వహించడం టి.వి.లలో చూస్తున్న జనానికి బయట గెలిచిన ఈ గురువుల గొప్పదనం తెలిసి వచ్చింది.

అదిగో అలా ప్రభావితురాలైన మంగమ్మగారు ఒకవారం అలహాబాద్‌లో క్యాంపుకు వెళ్ళి ప్రాణాయామ పద్ధతులు నేర్చుకుని వచ్చారు. అమెరికా వచ్చాక ఆ సాధన కాస్త మూలపడింది. పార్కుకు వచ్చిన వివిధ దేశాల వాళ్ళు తమ తమ శైలిలో నిర్మొహమాటంగా వ్యాయామాలు చేస్తుండడం చూసి మంగమ్మగారికి కాస్త ఉత్సాహం వచ్చింది.

అలా కూర్చున్న మంగమ్మగారు భస్త్రిక, కపాలభాతి, అనులోమ విలోమ వంటి మూడురకాల ప్రాణాయామం చేసి కాస్త విశ్రాంతి కోసం కళ్ళు తెరవగానే తలవైపే కుతూహలంగా చూస్తున్న జపనీస్ జంట, చైనీస్ యువతి, ఫిలిప్పైన్ దంపతులు కనబడ్డారు.

అంతలో దూరంగా తమ ఇంటి సందు మలుపు తిరిగి వస్తున్న మంగపతిగారు కనబడటం వలన వాళ్ళవైపు ఒక చిరునవ్వు విసిరి తను కూర్చున్న చోటు నుండి కదిలి ఇంటివైపు నడిచారు మంగమ్మగారు.

మర్నాడు ఏదో పని వుండడం వలన ఆవిడ పార్కుకు రాలేదు. మూడో రోజున మంగమ్మగారు రోడ్డు క్రాస్ చేసి పార్కులోకి రాగానే చైనీస్ ఆవిడ పలకరింపుగా నవ్వింది. ఆవిడ కూడ చేయి ఊపి తన చోటుకు వెళ్ళి కూర్చుంది.

పార్క్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ఫిలిప్పీన్ జంట చప్పట్లు కొడుతూ నడవడం మానేసి పార్కు లోపలికి వచ్చి మంగమ్మగారికి కాస్త దూరంలో కూర్చున్నారు.

ఈరోజు మొన్న చేసిన మూడు ప్రాణాయామాలతో బాటు 'బాహ్య ప్రాణాయామం', 'నాడీ శోధన', 'భ్రామరి', 'ఉద్గీత' ప్రాణాయామాలు చేసారావిడ.

రెండు చేతులతో రెండు కళ్ళు మూసుకుని, రెండు బొటన వేళ్ళతో చెవులు మూసి, చూపుడువేళ్ళు కనుబొమ్మల మీద వుంచి, ముక్కుతో గాఢంగా గాలి పీల్చుకుని, నోరుమూసి ముక్కుద్వారా గాలి వదులుతూ ఓంకార శబ్దాన్ని పలికిస్తూ 'భ్రామరి' ముగించి మధ్యలో విశ్రాంతి కోసం కళ్ళు తెరిచారు మంగమ్మగారు.

"యుడిడిన్ట్ కమ్ ఎస్టర్ డే.." అంటూ పలక

రించింది పిలిప్పిన్ స్త్రీ.

అవును అన్నట్టు తల ఊపి 'ఉద్గీత' ప్రాణాయామం మొదలుపెట్టిందావిడ. ముక్కు ద్వారా గాఢంగా గాలి పీల్చుకుని నోటితో వదులుతూ 'ఓం'కారాన్ని జపించ సాగింది. కళ్ళు మూసుకుని కూర్చున్న మంగమ్మగారి ముఖంలో కనబడుతున్న ప్రశాంతతను ఆశ్చర్యంగా చూస్తున్నారు పిలిప్పిన్ జంట.

ప్రాణాయామం ముగించాక రెండు చేతులూ తలమీదకి చేర్చి రెండు అరచేతులూ రుద్దుకుని ఆ వెచ్చదనాన్ని రెండు అరచేతులతో కళ్ళను కప్పి వాటికి అందించాక మనసులోనే గురువుకు, దక్షిణామూర్తికి నమస్కారం చేసుకుని లేచి ఇంటివైపు నడిచారు మంగమ్మగారు.

అలా మంగమ్మగారు వరుసగా అయిదారు రోజులు పార్కులో కూర్చుని ప్రాణాయామం చేసేసరికి రోజూ పార్కుకి నడక కోసం, వ్యాయామం కోసం వచ్చే వాళ్ళు తమంతట తాము ఆవిడను పలకరించడం మొదలుపెట్టారు.

'డిడ్‌యు లెర్న్ ఇట్ ఫ్రమ్ ఎ టీచర్?' అనడిగింది చైనీస్ ఆవిడ.

'యా! ఐ అటెండెడ్ ఎ యోగా క్యాంప్ అండ్ లెర్న్ట్ ఇట్' అని బదులిచ్చారు మంగమ్మగారు. ఆవిడ కుడివైపు నాసికా రంధ్రం కుడిచేతి బొటనవ్రేలితో మూసి ఎడమ నాసికారంధ్రము ద్వారా గాలి పీల్చి, కుడివైపు నుండి వదలి మళ్ళీ కుడివైపు నుండి పీల్చడం, ఎడమ నాసికా రంధ్రాన్ని ఎడమ చేతి నడుమ వ్రేలితో మూయడం చేస్తూ అనులోమ విలోమ ప్రాణాయామం చేయడం కాస్త దూరంలో కూర్చుని గమనిస్తున్న జపనీస్ ఆవిడ కూడా మంగమ్మ గారిని పలకరించింది.

"దీన్ని చేయడం వలన లాభమేమిటి?" అని అడిగింది ఇంగ్లీషులో.

"గాఢంగా ఊపిరి పీల్చుకున్నప్పుడు రక్తం శుభ్రపడ డానికి కావలసినంత ఆక్సిజను దొరుకుతుంది. అలాగే గాఢంగా ఊపిరి వదలినపుడు శరీరంలో అవసరమైనవి బయటకు పూర్తిగా పోతాయి..." అంటూ క్లుప్తంగా చెప్పి ఊరుకున్నారు మంగమ్మగారు.

"నువ్వు కళ్ళు, చెవులు, నోరు మూసుకుని డీప్ బ్రీత్ తీసుకుని వదిలేటప్పుడు ఒక శబ్దం చేస్తావే అది మీ మతానికి సంబంధించినదా?" అనడిగింది ఒకరోజు ఫిలిప్పిన్ ఆమె.

"నేను 'ఓం' అని పలుకుతాను. అది మా మతానికి

## గోదావరి హైకూలు

చూడముచ్చట
వెన్నెల్లో గోదావరి
అందచందాలు!

కెరటాలపై
పడవ డిస్కో డాన్సు!?
గోదావరిలో!

గోదావరికి
వెల్లువొస్తే అందమే
అపార నష్టం?!

గోష్పాద క్షేత్రం
చలన చిత్రాలకు
షూటింగు స్పాటు!

గోదావరిలో
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం
పట్టిసం నిధి!

## కళాప్రియ నానీలు

పైకే వాళ్ళిద్దరూ
ఆలు మగలు!
మనసులేమో
రైలు పట్టాలే!?

బుల్లితెరా
మజాకా?!
ఎదురుగా కూర్చున్నారంటే
అయస్కాంతమే!

ధనమున్న చదువబ్బదు
చదువున్న ధనముండదు
శ్రీ వాణీల
వైరమా!?

అందరి రక్తం
ఎరుపే!
తెలుపు, నలుపను
విభేదాలెందుకో?!

పూలెన్ని పూచినా / గులాబీలదే అందం!
సంపెంగలదే / సుగంధం!!

అమర గాయకుడు / ఘంటసాల!
నిర్మాత, నటుల పాలిట
టంకశాలే!!

–కళాప్రియ

## నానీలు

అమెరికాకు / ఔట్ సోర్సింగ్
దూరపు కొండలు / చాలా గరుకు
నేల కూడా / ఏడుస్తోంది
నోరు తెరిచిన బోరులోకి
ఆలి తాళి

పట్టపగలు / దేగ వాలింది
రాత్రి చేలో / కరెంటు ప్రవాహం
పురుగు / బతికే ఉంది
రైతు మరణించాడు
నకిలీ మందు తాగి

బరువు పెరిగిందని
ఉరేసుకున్నాడు
వాడు / బడి సంచీతో
ఆకలి చలి పుట్టి / అతడు
కప్పుకున్నాడు
పారేసిన సగం కంకి

రైతు / స్పృహతప్పి పడ్డాడు
అరువు నేలలో
అప్పు పిచికారీ చేస్తూ
ఆమెను / ప్రేమించాను
మనసు చదవడానికి
బ్రెయిలీ ఎందుకూ

తులసి కోట మీది
చీమలేవీ / నాయినమ్మ
పోయి మూడేళ్ళయింది
సర్కారీ బడి ముందు
వాన
బాల్యం
కత్తి పడవ

కథ ఆగింది
గోడకు ఆనించిన
చేతికర్ర
కాలిపోయి
మల్లె
ఎలా పూస్తుందీ?
తుపాకీ నాటితే
ఎర్ర మందారమే

-కె. రవికుమార్

సంబంధించినదే. సృష్టిలో మొట్టమొదటి శబ్దం అది. అయితే అది ఇష్టంలేదంటే 'బీ' చేసే శబ్దాన్ని అనుకరించవచ్చును" అన్నారు మంగమ్మగారు.

ఆవిడ పార్కులోకి వచ్చేటప్పుడు వెళ్ళేటప్పుడు చకచక నడవడం, సునాయాసంగా పద్మాసనం వేసుకుని కూర్చోవడం గమనించిన చైనా ఆవిడ ఒకరోజు అడిగింది. "మీ వయసు అరవై దాటి వుంటుందనుకుంటాను. మీరు చేస్తున్న యోగా వలననేనా మీరు ఈ వయసులోనూ ఆరోగ్యంగా వున్నారు? అనడిగింది.

"నేను చేసేది యోగాసనాలు కావు. ప్రాణాయామం. అది క్రమం తప్పకుండా చేస్తే ఎటువంటి అనారోగ్యం రాదని మా గురువుగారు చెప్పారు" అన్నారు మంగమ్మగారు.

"రేపటి నుండి మాకూ మీ ప్రాణాయామం నేర్పిస్తావా? విల్ యు బి అవర్ టీచర్?" అన్నారు అందరూ ఒకేసారి.

ఒక క్షణం పాటు మంగమ్మగారికి ఏం చెప్పాలో తెలియలేదు. కాసేపు ఆలోచించి ఇలా అన్నారు. "నేను టీచర్‌గా ఎవరికీ ఇది నేర్పించలేదు. మీకు ఇష్టమయితే నేను ఎలా చేస్తున్నానో చూసి మీరూ ప్రాక్టీసు చేయండి. నాకు అభ్యంతరం లేదు. కానీ అందులో నా బాధ్యత అంతవరకే" అన్నదామె.

మరుసటి రోజునుంచి ఏదో స్కూలుకో ఆఫీసుకో వెళ్ళినంత రెగ్యులర్‌గా తొమ్మిదింటికల్లా పార్కుకి వెళ్ళి కూర్చుని ప్రాణాయామం చేయడం మొదలెట్టారు మంగమ్మగారు.

కిటికీలోనుండి చూస్తున్న మంగపతిగారు భార్య ఎదురుగా కనీసం ఆరేడు మంది కూర్చుని తాము కూడా ఆవిడలా బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేయడం గమనించి ముక్కున వేలేసుకున్నారు.

ఆవిడ ఒకరోజు రాకపోతే "వి ఆర్ వెయిటింగ్ ఫర్ యు మిసెస్ మంగమ్మా" అంటూ గుమ్మం దాకా వచ్చి చెప్పి పోయారు వాళ్ళు.

"మంగమ్మగారు మాష్టరమ్మ పాత్ర బాగానే పోషిస్తున్నారు" అంటూ హాస్యంగానే అభినందించారు మంగపతిగారు.

"మరి ఛాలెంజి చేసారుగా 'నలుగురిని ఫ్రెండ్స్ చేసుకుని చూపించు అని... మంగమ్మ గారిని తక్కువగా అంచనా వేయకండి సార్" అంటూ నవ్వేసారు మంగమ్మగారు. ■